క్లుప్తంగా

ఆర్టీసీ డీఎం సత్యనారాయణకు సన్మానం



ఆర్టీసీ డీఎంను సన్మానిస్తున్న విశ్వహిందూ పరిషత్ ప్రతినిధులు

ఏలేశ్వరం: సంక్రాంతి సీజన్‌లో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించిన ఆర్టీసీ డిపో మేనేజర్ జీవీ సత్యనారాయణను పట్టణంలో సోమవారం ఘనంగా సన్మానించారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక ఆర్టీసీ డిపోలో మేనేజర్ సత్యనారాయణకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ అధ్యక్ష, కార్యదర్శులు ఏడీవీ ప్రసాద్, కటకం కిరీటి మాట్లాడుతూ డీఎం సత్యనారాయణ సంక్రాంతి సీజన్‌లో ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందించారన్నారు. లాభాల్లో రాష్ట్రంలోనే ఏలేశ్వరం ఆర్టీసీ డిపో నాలుగో స్థానంలో నిలిచిందన్నారు. కార్యక్రమంలో పి.దేవి, కె.ఇందిరా, గిరిజాకుమారి, సూర్యకుమారి, ఉడతల రమణారావు తదితరులు పాల్గొన్నారు.

గోకులం షెడ్లతో పాడి రైతులకు మేలు



కోటనందూరులో ల్యాబోరేటరీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దివ్య

తుని రూరల్: గోకులం షెడ్ల నిర్మాణంతో పాడి రైతులకు ఎంతో మేలు జరుగుతుందని ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. సోమవారం తుని మండలం వల్లూరులో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన గోకులం షెడ్డును ఆమె ప్రారంభించారు. తొలుత హంసవరం–వల్లూరు రోడ్డును రూ.45 లక్షలతో పునర్నిర్మించేందుకు ఆమె శంకుస్థాపన చేశారు. పుష్కర కాలువ చైర్మన్ కుర్ర వెంకటరమణ, నాయకులు యనమల రాజేష్, సుర్ల లోవరాజు, చింతంనీడి నాగసోమరాజు, మోతుకూరి వెంకటేష్, ఎంపీడీఓ సాయి నవీన్ పాల్గొన్నారు.

ల్యాబోరేటరీ భవనం ప్రారంభం

కోటనందూరు: స్థానిక పీహెచ్‌సీ ప్రాంగణంలో రూ.50 లక్షలతో నిర్మించిన ల్యాబోరేటరీ భవనాన్ని ప్రభుత్వ విప్ యనమల దివ్య ఆదివారం ప్రారంభించారు. ప్రజా రోగ్యానికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందన్నారు. అనంతరం కోటనందూరు గ్రామంలో రూ. 2.3 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డును ప్రారంభించారు. స్థానిక నాయకులు చిరంజీవిరాజు, గొర్లి అచ్చియ్యనాయుడు, బోడపాటి సత్తిబాబు, డీఎంహెచ్ నరసింహానాయక్ పాల్గొన్నారు.

దేవదాయ శాఖ ఇన్‌చార్జి కమిషనర్‌కు అభినందనలు

అన్నవరం: రాష్ట్ర దేవదాయ, ధర్మదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామచంద్రమోహన్‌కు అన్నవరం దేవస్థానం వ్రతపురోహిత సంఘం నాయకులు అభినందనలు తెలిపారు. సోమవారం విజయవాడ సమీపంలోని గొల్లపూడి కమిషనర్ కార్యాలయంలో కలిసి అభినందించారు. అన్నవరం దేవస్థానం అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో వ్రతపురోహిత సంఘం అధ్యక్షుడు, స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితుడు చామర్తి వెంకటరెడ్డి పంతులు (కన్నబాబు), స్పెషల్‌గ్రేడ్ వ్రతపురోహితులు మంధా శ్రీరామమూర్తి, తొయ్యేటి హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు ఆర్థిక సాయం



శృంగధారలో కాకర ప్రవీణ్‌కు ఆర్థిక సాయం అందిస్తున్న వైఎస్సార్ సీపీ నేత మురళీకృష్ణంరాజు

శంఖవరం: గిరిజన గ్రామాల్లో బాధిత కుటుంబాలను వైఎస్సార్ సీపీ నేత, ఎంఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ మదునూరి మురళీకృష్ణంరాజు సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. శృంగధార గ్రామానికి చెందిన కాకర సత్యనారాయణ మనవడను ప్రవీణ్ ఇటీవల ప్రమాదంలో గాయపడ్డాడు. ఆ కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేలు, నిత్యావసరాలు అందజేశారు. పి.మల్లాపురంలో ఇటీవల మృతిచెందిన కాకర ఎండియ్య కుటుంబాన్ని పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు గుండు నాగదేవి, మేకల సత్యనారాయణ, రామిశెట్టి ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ చిన్నారుల వివరాల సేకరణ

గండేపల్లి: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల వివరాల సేకరణకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ మేరకు స్థానిక పరిషత్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు, అంగన్‌వాడీ కార్యకర్తలతో సోమవారం ఎంపీడీఓ నాతి బుజ్జి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతు ఆధార్ కార్డు లేని పిల్లలకు ప్రత్యేకంగా ఆధార్ క్యాంప్‌ల ద్వారా కొత్తగా ఎన్‌రోల్ చేయించాలన్నారు. ఇప్పటికే ఆధార్‌కార్డు ఉన్న వారికి ఆధార్ నెంబర్ ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయాలని, జనన ధ్రువపత్రం లేని వారు తక్షణమే చేయించుకోవాలని సూచించారు.


ఇక బాదుడే బాదుడు !

- ఫిబ్రవరి నుంచే రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు
- కౌడా పరిధిలో భూములకు 25 శాతం మోత
- గ్రామీణ ప్రాంతాలోని భూములకు 30 శాతం పెంపు

ప్రత్తిపాడు: అధికారంలోకి వచ్చిన నాటి నుంచి కూటమి ప్రభుత్వం ప్రజల నెత్తిన పెను భారం మోపుతోంది. సూపర్ సిక్స్ హామీల అమలు మాట దేవుడెరుగు ఏదో విధంగా ప్రజలను దోచుకుంటూనే ఉంది. సంక్షేమ పథకాల ఊసెత్తకుండా ఇప్పటికే విద్యుత్ చార్జీల భారం మోపింది. ఈ కొత్త ఏడాది కానుకగా భూములు, స్థలాల విలువ పెంచుతోంది. ఆకాశన్నంటుతున్న నిత్యావసరాల ధరలు, పెరిగిన విద్యుత్ చార్జీలతో సతమతవుతున్న ప్రజలపై కూటమి ప్రభుత్వం మరో బాదుడుకు రంగం సిద్ధం చేసింది. భూముల మార్కెట్ విలువ అమాంతంగా పెంచేసింది. భూముల, గృహాల, భవనాల, కట్టడాల విలువ 30 శాతం పెరగనుంది. కొత్త రిజిస్ట్రేషన్ చార్జీలు ఫిబ్రవరి నెల నుంచే అమలు చేసేందుకు రాష్ట్ర స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ కసరత్తులు పూర్తి చేసింది. ఈ మేరకు ఫిబ్రవరి 1వ తేదీ నుంచే మార్కెట్ విలువలు పెరగనున్నాయి.

వారం రోజులుగా బిజీబిజీ

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో వ్యవసాయ భూములు, ఇళ్ల స్థలాల విలువలు 25 నుంచి 30 శాతం వరకు పెరగనున్నాయి. దీని వల్ల స్టాంపు డ్యూటీ, రిజిస్ట్రేషన్ చార్జీలు, బదిలీ సుంకం తడిసి మోపెడు కానుంది. గ్రామీణ ప్రాంతాల్లో భూములు, స్థలాలు, ఇళ్లు వంటి స్థిరాస్తుల క్రయ విక్రయాల రిజిస్ట్రేషన్ చార్జీలు ప్రతి రెండేళ్లకొకసారి పెంచుతారు. ఏటా 5 నుంచి 10 శాతం పెంపుదల అనివార్యం. ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలు పెరుగుతుండడంతో ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం గతవారం రోజులుగా క్రయ విక్రయ దారులతో రద్దీ నెలకొంది. ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచుతుండడంతో క్రయ విక్రయదారుల భూములు, స్థలాలు, ఇళ్లు వగైరా ఆస్తుల రిజిస్ట్రేషన్లు చురుగ్గా సాగుతున్నాయి.



ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

ప్రత్తిపాడు పరిధిలో 64 పంచాయతీలు

ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో సుమారు 400 గ్రామ పంచాయతీలున్నప్పటికీ 64 పంచాయతీలలో భూముల, స్థలాలకే క్రయ విక్రయాలు జరుగుతాయి. దీని పరిధిలోని రంపచోడవరం, ఏజెన్సీ గంగవరం, వై.రామవరం, అడ్డతీగల, రాజవమ్మంగి ఏజెన్సీ మండలాలు కావడంతో భూముల క్రయవిక్రయాలు జరగవు. ఈ మండలాలను ఇటీవలే కోరుకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలో చేర్చారు. ప్రస్తుతం ప్రత్తిపాడు, ఏలేశ్వరం మండలాలతో పాటు కిర్లంపూడి మండలంలోని ఎనిమిది పంచాయతీలు, పిఠాపురం మండలంలోని వెల్దుర్తి, దొంతమూరు, గొల్లప్రోలు మండలంలోని కొడవలి, చెందుర్తి, వన్నెపూడి, చిన జగ్గంపేట పంచాయతీలు, శంఖవరం మండలంలోని నాలుగు పంచాయతీలకు చెందిన భూములు, స్థలాలకు మాత్రమే ఈ కార్యాలయంలో లావాదేవీలు జరుగుతాయి.

13 గ్రామాల భూములకు 25 శాతం

భూముల మార్కెట్ విలువలను స్టాంప్స్, రిజిస్ట్రేషన్ల శాఖ 2019 రివిజన్ చేసింది. రివిజన్ చేసిన భూములకు 25 శాతం, రివిజన్ కానివాటికి 30 శాతం ధరలు పెంచనుంది. 2023లో కొన్ని గ్రామాలను పొటెన్షియల్ విలేజీలుగా గుర్తించారు. వాటిలో ప్రత్తిపాడు సబ్ రిజిస్ట్రార్ పరిధిలో గొల్లప్రోలు మండలం వన్నెపూడి, చెందుర్తి, శంఖవరం మండలం కత్తిపూడి, ఏలేశ్వరం మండలం లింగంపర్తి, సిరిపురం, యర్రవరం, ఏలేశ్వరం, ప్రత్తిపాడు మండలం ధర్మవరం, రాచపల్లి, ప్రత్తిపాడు, ఒమ్మంగి, కిర్లంపూడి మండలంలో జగపతినగరం, కిర్లంపూడి వెరసి 13 గ్రామాలను పొటెన్షియల్ గ్రామాల జాబితాలో చేర్చారు.

ప్రజలను పీడించడం సరికాదు



కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా ప్రజలపై భారం మోపుతున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు పెంచారు. ఫిబ్రవరి నుంచి రిజిస్ట్రేషన్ చార్జీలను పెంచాలని చూస్తున్నారు. ఇది ప్రజలను మోసం చేయడమే. ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీ కూడా నెరవేర్చ లేదు.

– మానుకొండ లచ్చబాబు, రాష్ట్ర కమిటీ సభ్యుడు, సీపీఐ (ఎంఎల్) లిబరేషన్

కొత్త చార్జీలతో అదనపు ఆదాయం



ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.54,62,54,000. కాగా ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు రూ.19,73,46,000 ఆదాయం సమకూరింది. కొత్త చార్జీలు అమలులోకి వస్తే 25 నుంచి 30 శాతం వరకు అదనంగా ఆదాయం సమకూరుతుంది.

– వి విక్టర్ డానియేల్, సబ్ రిజిస్ట్రార్, ప్రత్తిపాడు

ఉత్తమ సేవా అవార్డు గ్రహీతలకు సత్కారం



తునిలో ఉత్తమ సేవా పురస్కారం పొందిన ఏడీఏ బుల్లిబాబును అభినందిస్తున్న ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు



ఏలేశ్వరంలో వైద్యాధికారి శైలజను సన్మానిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

- వెల్లువెత్తిన అభినందనలు
- సేవలను కొనియాడిన ప్రజాప్రతినిధులు

తుని రూరల్: వ్యవసాయ సహాయ సంచాలకులు సుంకర బుల్లిబాబును సబ్ డివిజనల్‌లో ఏఓలు, ఏఈఓలు, వీఏఏలు ఘనంగా సత్కరించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ షన్మోహన్ నుంచి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న సందర్భంగా సోమవారం తుని ఏడీఏ కార్యాలయంలో అభినందన సభ నిర్వహించారు. ఏడీఏ బుల్లిబాబును శాలువాతో సన్మానించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. మరిన్ని పురస్కారాలు పొందాలని ఆకాంక్షించారు. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి ఏఓలు బి.అశోక్ కుమార్, కె.చంద్రశేఖర్, ఎస్.నరసింహం, ఆర్.ఈశ్వరరావు, పి.గాంధీ, వెంకటలక్ష్మి, ఆత్మ బీటీఎం బాబురావు, ఐదు మండలాల ఏఈఓలు, వీఏఏలు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మండల పరిషత్ కార్యాలయంలో..

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉత్తమ సేవా అవార్డు పొందిన ఎంపీడీఓ కె.సాయి నవీన్‌ను ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, ఈఓపీఆర్‌డీ ఎం.మరిడియ్య, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఎ.శివాజీ, ఏఓ శేషగిరిరావు, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఏలేశ్వరం: రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న వైద్యాధికారి శైలజను పట్టణంలో సోమవారం ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో స్థానిక సీహెచ్‌సీలో శైలజకు శాలువాతో సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. మరిన్ని అవార్డులు పొందాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు శిడగం వెంకటేశ్వరరావు, బదిరెడ్డి గోవిందు, సామంతుల సూర్యకుమార్, సుంకర రాంబాబు, వాగు బలరామ్, దాకమర్రి లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అందుబాటులో ఉంటా

వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం



సమావేశంలో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ తోట నరసింహం

జగ్గంపేట: నియోజకవర్గంలో ప్రజలు, కార్యకర్తలకు ప్రతి సోమవారం స్థానిక బాలాజీ నగర్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోట నరసింహం అన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు కూటమి ప్రభుత్వం ప్రజలకు తప్పుడు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలకు కొద్దిపాటి మేలు కూడా జరగడం లేదన్నారు. నియోజకవర్గ ప్రజలు, పార్టీ నాయకులకు ఎటువంటి సమస్యలు ఉన్నా ప్రతి సోమవారం తనను కలవవచ్చన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు పెట్టుబడులు సాధిస్తానని దావోస్ పర్యటనకు వెళ్లారని, కాని ఒక్క రూపాయి కూడా తేలదని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ గండేపల్లి మండల అధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ కాపరపు రమణ, నాలుగు మండలాల పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఆమోదం



సమావేశంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ అలమండ సత్యవతి

ఏలేశ్వరం: నగర పంచాయతీ కౌన్సిల్ సమావేశంలో సోమవారం పలు అభివృద్ధి పనులకు ఆమోదం తెలిపారు. స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో సోమవారం చైర్‌పర్సన్ అలమండ సత్యవతి అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. పేదలకు సాలివేషన్ సర్టిఫికెట్ ఇవ్వడంలో అధికారులు జాప్యం చేయడంపై 4వ వార్డు కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాలివేషన్ సర్టిఫికెట్ కోసం వచ్చే పేదవాళ్లను అధికారులు డబ్బులు డిమాండ్ చేస్తున్నారని, కార్యాలయానికి రావాలంటే బయపడే పరిస్థితి ఏర్పడిందని గోపి విమర్శించారు. దీంతో అధికారులు నచ్చచెబుతుండగా 3 వార్డు కౌన్సిలర్ బదిరెడ్డి గోవిందు కల్పించుకుని ప్రజలకు ఇబ్బంది లేకుండా అధికారులు సమన్వయంతో వ్యవహరించాలని సూచించారు. పట్టణంలో నిర్వహించే అభివృద్ధి పనులను ఆమోదించారు. మహా శివరాత్రి నిమిత్తం కేటాయించిన నిధుల మంజూరుకు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం



అల్లిపూడిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న కృష్ణస్వరూప్ తదితరులు

కోటనందూరు: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేయాలని మాల మహానాడు జాతీయ కమిటీ గౌరవాధ్యక్షుడు, సుప్రీంకోర్టు న్యాయవాది వడ్లమూరి కృష్ణస్వరూప్ పిలుపునిచ్చారు. మండలంలోని అల్లిపూడిలో సోమవారం దళితులతో బహిరంగ సభ నిర్వహించారు. తొలుత మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు వీఎల్ రాజుతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ ఆశయాలు, రాజ్యాంగ స్ఫూర్తికి వ్యతిరేకంగా దళితుల మధ్య చిచ్చు పెట్టేందుకు ఎన్డీఏ ప్రభుత్వం ప్రయత్నం చేస్తోందన్నారు. వర్గీకరణ జరిగితే ఎస్సీల్లో 59 కులాలకు నష్టం జరుగుతుందన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా దళితులంతా సంఘటితంగా పోరాటం చేయకపోతే బానిసత్వం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శులు మీలా గోపి, దాసరి రామచంద్రరావు, డి.సతీష్, యాదగిరి నానాజీ, నెమ్మాది పెదబాబు, నెమ్మాది సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నారాయణ విద్యాసంస్థలపై కేసు నమోదు చేయాలి



తుని డిగ్రీ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు

తుని: విద్యార్థి మృతికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై కేసు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల శాఖ డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక డిగ్రీ కళాశాల వద్ద సోమవారం ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గంగా సూరిబాబు, తుని మండల అధ్యక్షుడు జోసెఫ్ మాట్లాడుతూ ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలన్నారు. విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న నారాయణ, చైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ ప్రతినిధులు లక్ష్మణ్, శివ, భాస్కర్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

శంఖవరం: ప్రైవేట్ పాఠశాలల సమస్యలు పరిష్కరించాలని ప్రైవేట్ పాఠశాలల యూనియన్ సభ్యులు కోరారు. ఈ మేరకు సోమవారం ఎంఈఓ ఎస్వీ రమణకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రైవేట్ పాఠశాలల యూనియన్ సభ్యులు మాట్లాడుతూ ఫారం-1 ఆన్‌లైన్‌లో నమోదు చేసే కార్యక్రమాన్ని 20 రోజుల పాటు వాయిదా వేయాలన్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో పేదలకు 25 శాతం ఫ్రీ ఎడ్యుకేషన్ పద్ధతిని మార్చాలని కోరారు. కార్యక్రమంలో కోసూరి కృష్ణ, కోలా చంద్రరావు, సయ్యద్ హుస్సేన్, సఖిరెడ్డి గోవింద్, యండమూరి బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తాం

- అవినీతి జరుగుతుంటే సహించం
- మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: పట్టణాభివృద్ధి విషయంలో ప్రభుత్వానికి కౌన్సిల్ సహకరిస్తుందని, అవినీతి జరుగుతుంటే చూస్తూ ఊరుకునేది లేదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి స్పష్టం చేశారు. స్థానిక పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్‌పర్సన్ సుధారాణి అధ్యక్షతన జరిగింది. అజెండాలో 43 అంశాలను కౌన్సిల్ ఆమోదానికి ప్రవేశపెట్టారు. ఇందులో మూడు అంశాలను తిరస్కరించగా 40 అంశాలను ఆమోదించారు. అజెండాలోని 3, 12, 34 అంశాలపై అధికారులు, కౌన్సిలర్ల మధ్య వాడీవేడి చర్చ జరిగింది. కౌన్సిల్ సమావేశానికి అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని, కౌన్సిలర్లు అడిగిన ప్రశ్నలకు పూర్తి స్థాయిలో సమాచారం వివరించాలని చైర్‌పర్సన్ సుధారాణి సూచించారు.

అధికారులపై ప్రశ్నల వర్షం

అజెండాలోని 3వ అంశంలో మార్కండ్రాజుపేట మున్సిపల్ పార్కులో చేసిన అభివృద్ధి పనికి సంబంధించి రూ.9.51 లక్షలు చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని పేర్కొన్నారు. 28వ వార్డు కౌన్సిలర్ చింతకాయల భారతి తన వార్డులో తనకు తెలియకుండా ఎప్పుడు పార్కును అభివృద్ధి చేశారని అధికారులను ప్రశ్నించారు. పలువురు కౌన్సిలర్లు సమగ్ర వివరాలను తెలియ పరచాలని, ఇందుకు క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో పాటు 12, 34 అంశాల్లోనూ కౌన్సిలర్లు ప్రశ్నల వర్షం కురిపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో చేసిన పనులకు ఇప్పుడు ఎందుకు బిల్లులు పెట్టారని నిలదీశారు. దీంతో ఇంజినీరింగ్ అధికారులు నీళ్లు నమిలారు. ఈ సమయంలో చైర్‌పర్సన్ సుధారాణి జోక్యం చేసుకుని కౌన్సిలర్ల అనుమానాలను నివృత్తి చేయాలాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజల సొమ్ముకు ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాల్సి ఉందన్నారు. పాలకవర్గం అభివృద్ధి పనులను అడ్డుకుంటుందని అధికార పార్టీ నాయకులు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు చేస్తున్నారని, మేం అభివృద్ధిని కాదు అవినీతి వ్యతిరేకిస్తున్నామన్నారు. రాబోయే నెలల్లో జరిగే సమావేశానికి పూర్తిస్థాయి సమాచారంతో అధికారులు హాజరయ్యేలా చూడాలని కమిషనర్ ఎం.వెంకట్రావును ఆదేశించారు.

సమస్యలపై కౌన్సిల్ గళం

కూటమి ప్రభుత్వం వచ్చాక రూ.40 లక్షలతో కాలువల్లో పూడిక తీత పనులు చేశారని, మళ్లీ వీరవరపుపేట కాలువకు రూ.5 లక్షలు నిధులు కావాలని అజెండాలో పెట్టడడంపై కౌన్సిలర్ పులి సత్తిబాబు, కో ఆప్షన్ సభ్యుడు ఏలూరి బాలు ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో ఏడాదికి రూ.40 లక్షలు పూడిక పనుల కోసం ఖర్చు చేస్తే ప్రస్తుత ప్రభుత్వం రూ.50 లక్షలకు పెంచడం ఏమిటని నిలదీశారు. తుని రైల్వే అండర్ పాస్ నిర్వహణ గతంలో పారిశుధ్యం విభాగం చేసేదని, ఇప్పుడు ఎందుకు నిధులు కేటాయించాలని సభ్యులు అడిగారు. వీధి కుక్కలకు శస్త్ర చికిత్స కోసం రూ.11.59 లక్షలు నిధులు అవసరమని పెట్టిన అంశంపై సుదీర్ఘ వాదనలు జరిగాయి. జిల్లా కలెక్టర్ సూచనల మేరకు హర్యానాకు చెందిన సంస్థకు వీధి కుక్కల శస్త్ర చికిత్స కాంట్రాక్ట్‌ను అప్పగించినట్టు కమిషనర్ వెంకట్రావు తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించిన సమాచారం కౌన్సిలర్లకు చేరడం లేదని షేక్ ఖ్వాజా, వాసంశెట్టి శ్రీనివాస్, చింతల సునీత, ఆచంట సురేష్ తదితరులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై సచివాలయాలకు చెందిన అడ్మిన్‌తో కమిటీ ఏర్పాటు చేస్తామని కమిషనర్ అన్నారు. కౌన్సిలర్లు, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలి



అధికారులకు సూచనలు ఇస్తున్న కౌన్సిలర్లు, నాయకులు

ఏలేశ్వరం: మహా శివరాత్రిని పురస్కరించుకుని పుణ్యస్నానాలకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు, నాయకులు సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎం.సత్యనారాయణతో కలిసి కౌన్సిలర్లు సోమవారం శివరాత్రి జరిగే స్థానిక బ్రహ్మణరేవును పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే నెల 26న జరిగే శివరాత్రికి వేలాదిగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా నగర పంచాయతీ తరపున ఏర్పాట్లు చేయాలన్నారు. దీనికి కౌన్సిల్‌లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు బదిరెడ్డి గోవిందు, వాగు బలరామ్, నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, సామంతుల సూర్యకుమార్, ఏఈ అనూష తదితరులు పాల్గొన్నారు.

విలేజ్ మార్ట్ పరిశీలన

తొండంగి: మండలంలోని ఎ.కొత్తపల్లిలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేజ్ మార్ట్‌ను డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. మార్ట్‌లో అమ్మకాలు, డిస్కౌంట్లు తదితర అంశాలపై సిబ్బందితో చర్చించారు. వినియోగదారులకు తక్కువ ధరకు నిత్యావసర వస్తువులను అందించాలన్నారు. మరిన్ని డిస్కౌంట్లతో అమ్మకాలను పెంచాలని సూచించారు. అనంతరం సీసీలతో సమీక్షించారు. కార్యక్రమంలో డీపీఎం రాయ్, ఏపీఎం వై.సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎలక్ట్రీషియన్ డే

గోకవరం: స్థానిక యునైటెడ్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ కార్యాలయం వద్ద సోమవారం ప్రపంచ ఎలక్ట్రీషియన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యుత్ బల్బు సృష్టికర్త థామస్ ఆల్వాఎడిసన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే కార్యాలయం వద్ద జెండాను ఎగురవేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు పాలూరి బోసుబాబు, యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.

కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం



కనకదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరి తొలిపావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారి జన్మనక్షత్రం 'మూల' సందర్భంగా సోమవారం అమ్మవారికి చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11.20 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఐదుగురు భక్తులు రూ.750 టిక్కెట్‌తో హోమంలో పాల్గొన్నారు. వేదపండితులు గొల్లపల్లి గణపతి, చిట్టి శివ, కంచిభట్ల సాయిరామ్, నిట్టల కామేశ్వరరావు, వ్రతపురోహితులు చెల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



కత్తిపూడిలో హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ చేస్తున్న మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్, అధికారులు

శంఖవరం: ప్రయాణం చేసేటప్పుడు ప్రతిఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కత్తిపూడి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనువాస్ సూచించారు. రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని కత్తిపూడి జాతీయ రహదారిపై హెల్మెట్ ధారణపై అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనువాస్ మాట్లాడుతూ వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ పెట్టుకోవాలన్నారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదన్నారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

అరుణాచలేశ్వర స్వామికి విశేష పూజలు



రాచపల్లిలో విశేష అలంకరణలో అరుణాచలేశ్వరస్వామి

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. పండితులు స్వామి వారికి మహన్యసపూర్వక రుద్రాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని పూలతో విశేషంగా అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.